క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



రెంజల్(బోధన్): రెంజల్ పీఎస్ పరిధిలోని నీలా క్యాంపునకు చెందిన ఆంజనేయులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. శనివారం బాధితునికి అప్పగించినట్లు చెప్పారు. ఆంజనేయులు స్థానిక ఆలయం వద్ద మర్చిపోగా లారీ డ్రైవర్‌కు లభించిందని పేర్కొన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ఆపరేటర్ గణేశ్ ట్రేస్ చేసి గుర్తించినట్లు వివరించారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



వర్ని(చందూర్): కేరళ వరద బాధితుల కోసం చందూరు మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ నాయకులు విరాళాలు సేకరించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విరాళాలు సేకరిస్తున్నామని కార్మిక నేత నన్నేసాబ్ తెలిపారు. ప్రకృతి విలయతాండవంలో వరదల్లో వందల మంది చిక్కుకొని కేరళ ప్రజలు మరణించడం బాధాకరమన్నారు. విరాళాలు ఇచ్చి, మానవతావాదులు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాయిబాబా, భూమయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు

నిరుపేదలకు అల్పాహారం పంపిణీ



బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ సాగ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆటోనగర్ కాలనీలోగల నిరుపేదలకు, యాచకులకు అల్పాహారంతో పాటు స్వీట్ బాక్సులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్తలు అశోక్ రోడే, రమేష్ పవార్, పోశెట్టి, బండారి సాయిచరణ్, సాయిలు, శ్రావణి పాల్గొన్నారు.

నూతన జీపీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

రుద్రూర్: రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాల్లో 9 నూతన గ్రామ పంచాయతీ(జీపీ)ల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రుద్రూర్ మండలం అంబం(ఆర్) జీపీ పరిధిలోని కొందాపూర్, కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ జీపీలోని ఎక్లాస్‌పూర్ క్యాంపు, ఎత్తొండ జీపీలోని ఎత్తొండ క్యాంపు, లింగాపూర్ జీపీలోని శ్రీనివాస్ రెడ్డి కాలనీ, పోతంగల్ మండలం జల్లాపల్లి జీపీలోని జల్లాపల్లి పాత గ్రామం, జల్లాపల్లి ఫారం జీపీలోని జల్లాపల్లి తండా, సోంపూర్ జీపీ పరిధిలోని శ్రీనివాస్‌రెడ్డికాలనీ(రాంగంగానగర్), పోతంగల్ జీపీలోని తిర్మలాపూర్‌ను పంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏ క్షణాన కూలుతుందో?

- శిథిలావస్థలో మెండోరా పశు వైద్యశాల
- పట్టించుకోని పాలకులు



పెచ్చులూడిన వైద్యశాల పైకప్పు



ఫ్లోరింగ్ కుంగి ఏర్పడిన గుంత



మెండోరా పశు వైద్యశాల

బాల్కొండ : మెండోరా మండల కేంద్రంలోని పశు వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణాన కూలుతుందోనని సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. నూతన మండల కేంద్రంగా ఏర్పడక ముందు నుంచే మెండోరాలో గ్రామీణ పశు వైద్యశాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంగా మారి ఆరు సంవత్సరాలు దాటినా ఇప్పటికీ ఎలాంటి మార్పు రాలేదు. పైగా రోజు రోజుకు శిథిలమై కూలిపోయే స్థాయికి వచ్చింది. దీంతో సిబ్బంది బయట కూర్చునే విధులు నిర్వహిస్తున్నారు. మూగ జీవాల వేదన.. రోదన ప్రభుత్వాలకు పట్టడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనానికి మరమ్మతులు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. మొత్తం స్లాబ్ పెచ్చులూడుతుంది. వర్షం కురిస్తే చాలు నీరు వరదలా స్లాబ్ నుంచి ఊరుస్తోంది. కింద ఫ్లోరింగ్ కుంగి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పశువుల కోసం నిల్వ ఉంచిన మందులు వర్షం కురిసిన రోజు తడిసి ముద్దవుతున్నాయి. పూర్తి స్థాయి వైద్యుడు లేడు. ఇన్‌చార్జి వైద్యుడితోనే మండల కేంద్రం ఏర్పడిన నాటి నుంచి నెట్టుకు వస్తున్నారు. పాలకులు స్పందించి నూతన భవన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. పూర్తి స్థాయి వైద్యుడిని కూడా వెంటనే నియమించాలని వేడుకుంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మెండోరా మండల కేంద్రంలోని పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విధులు నిర్వర్తించడానికి సిబ్బంది జంకుతున్నారు. బయట ఉండే విధులు నిర్వర్తిస్తున్నాం.

– డాక్టర్ గౌతం రాజు, ఇన్‌చార్జి పశు వైద్యాధికారి, మెండోరా

నిబంధనలు బేఖాతర్!



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ సెలవైన రెండో శనివారం కూడా నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్న పలు ప్రయివేటు పాఠశాలల ముందు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆర్మూర్ శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దగ్గరుండి స్కూళ్లను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఇందూర్ జిల్లా కన్వీనర్ దామ సునీల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విశ్రాంతి లేకుండా మానసికంగా ఒత్తిడి పెంచుతున్నారని అన్నారు. మరోసారి ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలు నడిపిస్తే ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి ప్రీతం, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాయామం చేసేదెలా?



ఓపెన్ జిమ్‌లో విరిగిన వ్యాయామ పరికరం



మల్లారెడ్డి చెరువు సమీపంలోని ఓపెన్ జిమ్‌లో హ్యాండిల్ విరిగిన వ్యాయాయ పరికరం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని టీయూఎఫ్‌డీసీ నిధులతో పట్టణంలోని పలు వార్డుల్లో రూ.లక్షలు వెచ్చించి 18 చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. కానీ కొన్ని చోట్ల ఓపెన్ జిమ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మినీ స్టేడియంలో, మల్లారెడ్డి చెరువు సమీపంలో రెండు, సిద్దుల గుట్టపై, హౌసింగ్‌బోర్డు పాటు, మామిడిపల్లి, పెర్కిట్‌లోని పలు వార్డులలో స్థానికుల కోసం ఏర్పాటు చేశారు. ఓపెన్ జిమ్‌లకు రక్షణ కంచెలు లేకపోవడం, మరికొన్ని చోట్ల ఉన్న పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. ప్రతిరోజు వాకింగ్ వచ్చే ప్రజలు పరికరాలు సరిగా లేకపోవడంతో వ్యాయామం చేయలేకపోతున్నారు. అంతేగాక ఓపెన్ జిమ్‌లు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని వినతి



మంత్రితో సంఘం రాష్ట్ర ప్రతినిధులు

బోధన్ : అవయవదాతల అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలన్న తమ విన్నపం మేరకు జీవో విడుదల చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ హామీ ఇచ్చారని శనివారం బోధన్‌కు చెందిన తెలంగాణ శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాట్రగడ్డ భారతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రిని అఖిల భారత అవయవదాతల సంఘం వ్యవస్థాపకులు గూడూరు సీతామహాలక్ష్మితో కలిసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 13న ఉదయం 11 గంటలకు గాంధీ మెడికల్ కాలేజీలో నిర్వహించనున్న ప్రపంచ అవయవదాతల దినోత్సవ సమావేశానికి మంత్రి హాజరు కానున్నారని తెలిపారు.

'పట్టణ సమస్యలు పట్టించుకోవడం లేదు'



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, శివారులో కాలనీల రోడ్లతో పాటు ప్రధాన రోడ్లపై గుంతల్లో నీరు నిలిచినా బల్దియా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ విమర్శించారు. శనివారం పట్టణంలో రవీందర్ మాట్లాడారు. ఇప్పటికైనా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పట్టణంలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగారాం, నాయకులు సత్యం, రజాక్, రవిశంకర్‌గౌడ్, జాదవ్, సాగర్ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా..



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో శనివారం భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దేశంలో మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ కూడలిలో గల స్వామి వివేకానంద విగ్రహాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం ఆలూర్ మండల అధ్యక్షుడు గంగోల్ల ప్రశయ్ తేజ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నడికరం మల్లయ్య, కార్యదర్శి చరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పునాదులు దాటలేదు



పునాది దశలోనే ఆగిన మాదాపూర్ గోదాము పనులు

- నిలిచిన బొంకన్‌పల్లి, మాదాపూర్ గోదాముల నిర్మాణ పనులు
- నిధులు విత్‌డ్రా చేసినా ముందుకు కదలని వైనం
- ఇబ్బంది పడుతున్న రైతులు



బొంకన్‌పల్లి గోదాము

మాక్లూర్ : రైతుల సౌకర్యార్థం మాక్లూర్ సొసైటీ పరిధిలో చేపట్టిన గోదాముల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి సంవత్సరం కావస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. పావు వంతు పనులు చేపట్టిన గుత్తేదార్ 50 శాతం నిధులు లేపేయటంపై స్థానిక రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. ప్రభు అనే ప్రయివేట్ సంస్థ ఈ రెండు గోదాముల నిర్మాణ పనులు చేపట్టింది. 1,500 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల గోదాములకు గాను ఒక్కో గోదాం నిర్మాణానికి రూ.55 లక్షల అంచనా వ్యయంతో మాదాపూర్, బొంకన్‌పల్లిలలో 2022, జూలై 31న అప్పటి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పునాదులు తీసి బెస్‌మెంట్ లెవెల్ పనులు మాత్రమే చేశారు. నిధులేమో రూ.37 లక్షల 57వేలు డ్రా చేసేశారు. సంవత్సర కాలంగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ గోదాంలను ఇంకెప్పుడు పూర్తి చేస్తారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

చాలా ఆలస్యమైంది



నిధులు విత్ డ్రా చేసుకున్నా గోదాం నిర్మాణ పనులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే గోదాముల పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తోంది. ఇంకా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఎరువులను మాక్లూర్‌కు వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. పనులు పూర్తి చేయటంలో ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

– తోట గంగాధర్, బొంకన్‌పల్లి, మాక్లూర్

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



డొంకేశ్వర్(ఆర్మూర్) : మండలంలోని మారంపల్లి హనుమాన్ మందిరంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. నందిపేటలోని కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హిందుత్వం గురించి ప్రవచనాలు చెప్పారు. నారాయణస్వామి, ఆరే గంగాధర్, లక్ష్మీనారాయణ, బాపురావు, సంతోష్, భక్తులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

బాల్కొండ: మండల కేంద్రంలో దోమల నివారణకు శనివారం చర్యలు చేపట్టారు. హెల్త్ ఎడ్యుకేటర్ మురళి ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో తిరుగుతూ వర్షపు నీరు నిలచిన చోట దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మారుతి మందిర్‌లో భక్తుల ప్రత్యేక పూజలు



బోధన్‌రూరల్: పట్టణంలోని మారుతి మందిర్‌లో శ్రావణమాస శనివారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఆంజనేయ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహరాజ్ ఉదయం ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహరాజ్, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన నర్సింహస్వామి ఆలయం



ఆర్మూర్‌టౌన్: శ్రావణ శనివారం మొదటి రోజు కావడంతో పట్టణంలోని గోల్‌బంగ్లా ప్రాంతంలో గల నర్సింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం పురోహితుడు వెంకయ్య, నర్సింహస్వామికి అభిషేకం చేసి పువ్వులతో అందంగా అలంకరించారు. భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	పాగల్ వీఎస్ కాదల్ (తెలుగు) – 02.15 భవనం 4.35, 10.20
స్క్రీన్-2 –	కమిటీ కుర్రోళ్లు – 12.30, 3.45, 07.00, 10.15
స్క్రీన్-3 –	మురారి (తెలుగు) – 11.05, 6.00, 10.00
స్క్రీన్-4 –	రాయన్ (తెలుగు) 11.40, 6.35, కల్కి 2898 ఏడీ (తెలుగు) – 2.50, 9.45

అన్నదాతలూ జరభద్రం!

- ప్రకృతి వైపరీత్యాలు, పాములు, విష కీటకాలతో పొంచి ఉన్న ప్రమాదాలు
- వానాకాలం పంటల సాగు సమయంలో అజాగ్రత్తతతో ప్రమాదాల బారిన పడే అవకాశం
- పంటల సాగు పనుల్లో పాటించాల్సిన జాగ్రత్తలపై అధికారుల సూచనలు

బోధన్‌రూరల్(బోధన్): జిల్లా వ్యాప్తంగా వర్షాకాలం పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు పుష్కలంగా కురుస్తూ వానాకాలం పంటల సాగు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతలు, వ్యవసాయ కూలీలు నిత్యం వ్యవసాయ పొలాల్లో పంటల సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వరి, ఇతర పంటల కలుపులు తీయడం, ఎరువులు, మందులు చల్లడం వంటి పనులతో రైతులు, వ్యవసాయ కూలీలు బిజీబిజీగా గడుపుతున్నారు. పనుల్లో నిమగ్నమయ్యే సమయంలో అన్నదాతలు, కూలీలు ఆదమరిచి చిన్నచిన్న తప్పిదాలు, అజాగ్రత్తతో ఉండటంతో ప్రకృతి వైపరీత్యాలు, పాములు, తేళ్లు, క్రిమికీటకాలు, మందుల స్ప్రే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పంటల సాగు సమయంలో అన్నదాతలు, వ్యవసాయ కూలీలు ప్రమాదాలకు గురవ్వకుండా పాటించాల్సి పలు జాగ్రత్తలపై నిపుణుల సలహాలతో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

మందుల పిచికారీ సమయంలో..

పంట పొలాల్లో మందులను చల్లే సమయాల్లో రైతులు సరైన జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల తరచూ ప్రమాదాల బారిన పడుతుంటారు. ఎరువులు, క్రిమి సంహారక మందులను పిచికారీ చేసేటప్పుడు అజాగ్రత్త వల్ల రైతులు అస్వస్థతకు గురై ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది



- పిచికారీ సమయంలో ముఖానికి మాస్క్‌లు, చేతులకు గ్లోవ్స్, కాళ్లకు రబ్బరు బూట్లు ధరించాలి
- మందులను కర్ర సాయంతో కలుపుకోవాలి
- మందుల పిచికారీ, చల్లడం వంటి పనులు పూర్తయిన వెంటనే చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- స్నానం చేసి తర్వాతే భోజనం చెయ్యాలి
- పురుగు మందులు, ఎరువుల డబ్బాలను వాడిన వెంటనే సర్పు నీటితో శుభ్రం చేసుకోవాలి.

పిడుగుపాటు సమయంలో..

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలో ఉన్నటుండి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురువడం సర్వసాధారణం. ఈ సమయంలో వర్షంలో తడవకుండా ఉండేందుకు రైతులు చెట్ల కిందకు వెళ్లి తలదాచుకుంటారు. చెట్ల కింద తలదాచుకోవడం వల్ల పిడుగుపాటుకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి..

- ఎట్టి పరిస్థితిల్లో కూడా చెట్ల కిందకు వెళ్లకూడదు
- విద్యుత్ ప్రసరించే వస్తువులు, కరెంట్ తీగలకు దూరంగా ఉండాలి
- వర్షంలో తడవకుండా ఉండేందుకు ప్లాస్టిక్ దుస్తులు లేదా రెయిన్‌కోట్‌లను ధరించి చెట్లు, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి

జాగ్రత్తగా ఉండాలి



వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పొలాల్లో రైతులు, కూలీలు చిన్న, చిన్న తప్పిదాల వల్ల ప్రమాదాలకు గురవుతుంటారు. ముఖ్యంగా రైతులు, కూలీలు ప్రకృతి వైపరీత్యాలు, పిడుగుపాట్లు, పాములు, తేళ్లు, క్రిమికీటకాల వల్ల, పురుగు మందుల స్ప్రే సమయంలో ప్రమాదాల బారిన పడుతుంటారు. జాగ్రత్తతో వ్యవహరించడం ద్వారా ప్రమాదాలకు గురవ్వకుండా ఉండవచ్చు.

– సంతోష్, ఇన్‌చార్జి ఏడీఏ, బోధన్

పాములు, విష పురుగులతో..

వర్షాకాలంలో పాములు, తేళ్లు, విష పురుగులు, కీటకాల సంచారం ఎక్కువగా ఉంటుంది. గట్ల వెంబడి, ఎలుకలు పెట్టిన బొరియల్లో పాములు, విష కీటకాలు, పురుగులు చేరి ఉంటాయి.

- గట్లపై ఎప్పుడూ గడ్డి పెరగకుండా చూసుకోవాలి
- కలుపు మొక్కలను తొలగించేటప్పుడు, పొలాల గట్లపై నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి
- బోర్లు, మోటారు బోర్లుల వద్ద గడ్డి, పిచ్చి మొక్కలు పెరగకుండా శుభ్రంగా ఉంచుకోవాలి
- ఏదైనా కీటకం కాటు వేసినట్లు అనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యులను సంప్రదించి సరైన వైద్యం చేయించుకోవాలి
- నాటువైద్యం జోలికి వెళ్లకూడదు